క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కొనకనమిట్ల: మండలంలోని వాగుమడుగు గ్రామంలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 7 గంటలు, సాయంత్రం 5 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, ఎంపీపీ మోర బోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, ప్రభుత్వ అధికారులు పాల్గొంటారని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

యర్రగొండపాలెం: మండలంలోని వీరభద్రాపురంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి తెలిపారు. సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొంటారని, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు ప్రజావేదిక

కురిచేడు: 2022–23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీలో భాగంగా బుధవారం ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వసంతరావు నాయక్ తెలిపారు. సామాజిక తనిఖీలో గుర్తించిన అంశాలపై ఉదయం 10 గంటలకు ప్రజావేదిక ప్రారంభమవుతుందన్నారు. మండలంలోని ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, జిల్లా ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీపీ హాజరు కావాలని కోరారు.

నేడు వైద్య శిబిరం

దర్శి: ఎంఎస్‌ఆర్ క్యాన్సర్ సెంటర్, దర్శి ప్రభుత్వ ఆస్పత్రి సంయుక్తంగా బుధవారం కాన్సర్ వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ వి.వెంకట్రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరంలో కాన్సర్ స్పెషలిస్టు వైద్యులు రఘునందన్ (రేడియోషన్ అంకాలజిస్ట్) వైద్య పరీక్షలు చేస్తారని చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 2 గంటల వరకు ఓపీలు చూడనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 74167 61641 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రీసర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

తాళ్లూరు: ప్రభుత్వం నిర్వహిస్తున్న భూసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని వక్తలు అన్నారు. స్థానిక రైతు భరోసా కార్యాలయంలో మంగళవారం గ్రామ రైతులతో ఆయన సమావేశమయ్యారు. జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న భూ సమస్యలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో శాశ్వత పరిష్కారం దొరుకుతోందని, రైతులు సక్రమంగా ఉపయోగించుకోవాలని కోరారు. రెవెన్యూ అధికారులకు పూర్తి యిలో సహకరించాలని కోరారు. తహసీల్దార్ కేవీ ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటికే డ్రోన్ సర్వే పూర్తయిన చోట డ్రోన్ సర్వే ద్వారా వచ్చిన ఓఆర్ఎల్ షీట్స్ తీసుకుని వీఆర్‌ఓలు రైతుల పొలాలకు వస్తారని చెప్పారు. తర్వాత రైతు సూచన మేరకు ల్యాండ్ ప్లాన్ మెజర్‌మెంట్ (ఎల్‌పీఎం)లు నమోదై వస్తాయని చెప్పారు. 2022 నవంబర్ 1 ముందు ఉన్న సాధారణ అగ్రిమెంట్స్ పరిగణనలోకి తీసుకుని ఆన్‌లైన్‌కు తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సర్పంచి మేకల చార్లేస్ సర్జన్, ఎంపీటీసీ యామర్తి ప్రభుదాస్, డీటీ ప్రశాంత్, వీఆర్‌ఓ చంద్ర, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు సోము అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కుంట ఆక్రమణను పరిశీలించిన అధికారులు

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ పరిధి కాశిరెడ్డినాయన కుంట స్థలం ఆక్రమణకు గురైనట్లు స్పందనలో వచ్చిన అర్జీ మేరకు తహసీల్దార్ కె.వి జయకుమారి, కమిషనర్ వై.రామకృష్ణయ్యలు కలిసి మంగళవారం పరిశీలించారు. కుంట స్థలం 7 ఎకరాల 66 సెంట్లు ఉండగా అందులో ఎంత మేర ఆక్రమణకు గురైందనే విషయాన్ని అధికారులు తేల్చాల్సి ఉంది. కుంటను సర్వేయర్ ద్వారా కొలతలు వేయించి ఆక్రమణదారులను గుర్తించి వారికి నోటీసులు జారీ చేయాల్సిందిగా స్థానికులు అధికారులకు సూచించారు.

చెంచు కుటుంబాలకు భోజనాలు



భోజనాలు వడ్డిస్తున్న మాజీ ఎంపీపీ రవి

అర్ధవీడు (కంభం): అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులుగా మిగిలిన చెంచు కుటుంబాలను మాజీ ఎంపీపీ సన్నెబోయిన రవికుమార్ యాదవ్ మంగళవారం పరామర్శించారు. ప్రమాదానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. మంటల్లో ఇళ్లు కాలిపోయి కట్టుబట్టలతో నిరాశ్రయులుగా మిగిలిన కాలనీ వాసులకు భోజన ఏర్పాట్లు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు రావిపాటి రామేశ్వర రెడ్డి, కిరణ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్య అందించడమే లక్ష్యం



ముండ్లమూరులో కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సునీత, అధికారులు



తాళ్లూరులో జెడ్పీటీసీ, అధికారులు

ముండ్లమూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా వసతులు కల్పించి వారి విద్యాభివృద్ధికి పాటుపడడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి లక్ష్యమని ఎంపీపీ సుంకర సునీత అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలలో మంగళవారం వరుసగా నాలుగో ఏడాది మంజూరైన జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు ఆమె పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి పేద విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక వసతులు, విద్యాకిట్లు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రతి విద్యార్థి పైసా ఖర్చు లేకుండా తనకు అవసరమైన అన్ని రకాల యూనిఫాం, పుస్తకాలు, బ్యాగ్‌తో పాఠశాలకు గర్వంగా వెళ్లేందుకు అన్ని రకాల వసతులను కల్పించిన ఘనత జగనన్నకే దక్కుతోందన్నారు. ప్రాథమిక దశ నుంచే విద్యార్థుల్లో చదువుపై మనోధైర్యాన్ని పెంచేందుకు అమ్మఒడిని అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. తల్లిదండ్రుల కలలను సాకారం చేసేందుకు ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదవాలన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడి యువత తమ భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఎక్సైజ్ ఎస్‌ఐ శ్రీధర్‌బాబు విచారం వ్యక్తం చేశారు. పాఠశాలల్లో అలాంటి ఆనవాళ్లు కనిపిస్తే నిర్భయంగా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుంకర బ్రహ్మారెడ్డి, ఎంఈఓ చంద్రమోహన్, హెచ్‌ఎం రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

తాళ్లూరు: జగనన్న విద్యాకానుక విద్యార్థులకు వరమని జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి అన్నారు. స్థానిక వీకే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న విద్యాకానుకను పంపిణీ చేశారు. జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. నాడు– నేడుతో పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి కంటే అదనంగా సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నాడు–నేడు ద్వారా గడిచిన 75 ఏళ్లలో జరిగిన అభివృద్ధి ప్రస్తుతం పాఠశాలల్లో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కచ్చితంగా ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని సూచించారు. పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. సర్పంచి మేకల చార్లేస్ సర్జన్, ఎంపీటీసీ యామర్తి



కిట్లు పంపిణీ చేస్తున్న ఎంఈఓ వెంకటేశ్వర్లు

ప్రభుదాస్, కో ఆప్షన్ మెంబర్ కరిముల్లా, హెచ్‌ఎం అజయ్‌బాబు పాల్గొన్నారు.

బేస్తవారిపేట: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం అనేక కార్యక్రమాలు ఏర్పాటు చేసిందని ఎంఈఓ జింకా వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్లో జగనన్న విద్యా కానుక కిట్లను ఆయన పంపిణీ చేశారు. నాడు–నేడు పథకంలో పాఠశాలలను అందంగా తీర్చిదిద్దడం, డిజిటల్ బోధన, విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం, ట్యాబ్‌లు, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం, టెక్స్ట్ బుక్స్, యూనిఫామ్స్ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా అందించనున్నట్లు పేర్కొన్నారు. మండల ఉపాధ్యక్షుడు ఖాజామీయా, సర్పంచ్ ఆశ్రిత జ్యోతి, హెచ్‌ఎం ఎంఎస్ శర్మ పాల్గొన్నారు.

పాఠశాలకు మంచి పేరు తేవాలి



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, సీఐ భీమానాయక్

- విద్యార్థులకు ఎమ్మెల్యే కేపీ సూచన

మార్కాపురం టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించటం అభినందనీయమని ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో ఈ ఏడాది ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు మార్కాపురం సీఐ భీమానాయక్ నగదు బహుమతులు అందజేశారు. నాగజ్యోత్స్నకు ప్రథమ బహుమతి 5,116, యశశ్రీకి ద్వితీయ బహుమతి రూ.3116, అమృత వర్షిణికి తృతీయ బహుమతి రూ.2116 అందజేసి అభినందించారు.

టెన్త్ విద్యార్థినికి అభినందనలు

కొనకనమిట్ల: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 567 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన గొట్లగట్టు జెడ్పీ పాఠశాల విద్యార్థిని ఉప్పుటూరి తేజశ్వినిని మంగళవారం



తేజశ్వినిని అభినందిస్తున్న హెచ్‌ఎం సుధారాణి

హెచ్‌ఎం ఎస్‌వీ సుధారాణి, గ్రామ పెద్దలు అభినందించారు. పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో హెచ్‌ఎం మాట్లాడుతూ.. తేజశ్వినిని ఆదర్శంగా తీసుకుని ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఉప్పుటూరి పెదవెంకటయ్య, పూర్వ విద్యార్థి ఎన్.వెంకటేశ్వర్లు, పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు తువ్వపాడులో ధ్వజ స్తంభ ప్రతిష్ఠ



హోమాలు చేస్తున్న కంకణధారులు

కొనకనమిట్ల: మండలంలోని తువ్వపాడు గ్రామంలో పునర్నిర్మించిన రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పోలేరమ్మ, గణపతి, సుబ్రహ్మణ్య, నాగేంద్ర స్వామి, శీతలాదేవి విగ్రహాలతోపాటు యంత్ర, జీవ, ధ్వజ, నవగ్రహ విగ్రహాలను వేద పండితుడు ఓరుగంటి సీతారామశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. కంకణదారులతో హోమాలు నిర్వహించారు. తొలుత దేవతా విగ్రహాల గ్రామోత్సవం నిర్వహించారు. బుధవారం పుణ్యాహవచన హోమం, సీతారాముల మందిరం వద్ద ధ్వజ స్తంభ ప్రతిష్ఠ, యంత్ర పూజ, సుందరకాండ పారాయణం, నివేదన హారతి, శాంతి కల్యాణం, అన్నదానం నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



చెక్కు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉడుముల

కొనకనమిట్ల: మండలంలోని నాగంపల్లి ఎస్సీ కాలనీకి చెందిన కొండ్రు భాగ్యలక్ష్మికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కును మంగళవారం వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి అందజేశారు. భాగ్యలక్ష్మికి సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.2.30 లక్షలు మంజూరయ్యాయని ఎంపీటీసీ కొండ్రు వెంకటేశ్వర్లు, సర్పంచ్ తాతిరెడ్డి చినవెంకటరెడ్డి తెలిపారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న డాక్టర్ కనకదుర్గ

మార్కాపురం టౌన్: ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సహకారంతో మార్కాపురం 4వ వార్డులో అభివృద్ధి పనులు చేపట్టినట్లు కౌన్సిలర్, శ్రీశైలం ట్రస్టుబోర్డు మెంబర్ డాక్టర్ కనకదర్గ పేర్కొన్నారు. మంగళవారం 4వ వార్డులోని రామాలయం వీధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆమె పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేసి మోడల్‌గా నిలుపుతానని చెప్పారు. కార్యక్రమంలో డీఈ సుబానీ, ఏఈ ఆదినారాయణ, నాగార్జునరెడ్డి, పుల్లారావు, సీతారామిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కనకదుర్గను పలువురు సన్మానించారు.

కౌలు కార్డులు అందేలా చొరవ చూపాలి

తాళ్లూరు: గ్రామ రెవెన్యూ అధికారులు, వ్యవసాయ అసిస్టెంట్స్ కౌలు రైతులకు అవగాహన కల్పించి క్రాప్ కల్టివేషన్ సర్టిఫికెట్స్ అందేలా చొరవ తీసుకోవాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు కోరారు. తాళ్లూరులో మండల స్థాయి వ్యవసాయ సలహా కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఖరీఫ్‌లో తప్పనిసరిగా కౌలుదారులు కార్డులు పొందేలా చూస్తే రాబోవు రోజుల్లో ప్రకృతి విపత్తులు సంభవిస్తే తగిన విధంగా సాయం పొందేందుకు వీలుంటుందని స్పష్టం చేశారు.

స్కూల్ బస్‌లపై ప్రత్యేక నిఘా

దర్శి: స్కూల్ బస్‌లపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు ఎంవీఐ రవికుమార్ అన్నారు. దర్శిలో ఫిట్‌నెస్ లేని కారణంగా రెండు బస్‌లపై మంగళవారం ఆయన కేసు నమోదు చేశారు. ఎంవీఐ రవికుమార్ మాట్లాడుతూ పిల్లలను దృష్టిలో పెట్టుకుని పాఠశాలలు ప్రారంభమైన సందర్భంగా స్కూల్ బస్‌లు ఫిట్‌నెస్, కండీషన్, పొల్యూషన్, ఇన్సూరెన్స్, ఐదేళ్ల అనుభవం కలిగిన డ్రైవర్, క్లీనర్ తప్పని సరిగా ఉండాలని చెప్పారు. అలా లేని బస్‌లు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఫిట్‌నెస్ లేని బస్‌లు నడిపితే ఆ బస్‌లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఫిట్‌నెస్ లేకుండా నడిపి ప్రమాదాలు జరిగితే స్కూల్ యాజమాన్యాలపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులను పరిమితికి మించి బస్ ఎక్కించినా కేసులు నమోదు చేస్తామన్నారు.



సీజ్ చేసిన బస్ వద్ద ఎంవీఐ రవికుమార్

ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి

మార్కాపురం: ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందించాలని జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ ప్రసన్నకుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం చంద్రశేఖరరెడ్డి అధ్యక్షతన జీ–20 దేశాల సమాఖ్యపై జనభాగీధార్ కార్యక్రమం నిర్వహించారు. నవోదయ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఒక భూమి, ఒక కుటుంబం, ఒక భవిష్యత్ అనే నినాదంతో జీ–20 దేశాల సమాఖ్యకు భారత్ అధ్యక్షత వహిస్తోందని చెప్పారు. పర్యావరణం, విపత్తుల నిర్వాహణ, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, ఉగ్రవాద నిర్మూలన, వాణిజ్యం తదితర 13 అంశాలపై జీ–20 సదస్సు ప్రపంచ దేశాలకు సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. ప్లాస్టిక్ వినియోగంను తగ్గిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బోధనా సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రసన్నకుమార్

ఆత్మస్థైర్యమే దివ్యాంగుల ఆయుధం

- జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకులు అర్చన
- పొదిలిలో దివ్యాంగులకు త్రిచక్ర వాహనాలు పంపిణీ

పొదిలి రూరల్: జీవితంలో ఎదుగుదలకు వైకల్యం అడ్డుకాదని, ఆత్మస్థైర్యమే ఆయుధంగా దివ్యాంగులు ముందుకు సాగాలని జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకులు జి.అర్చన పేర్కొన్నారు. ప్రభుత్వాలు కల్పిస్తున్న సౌకర్యాలు, రాయితీలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మంగళవారం పొదిలి స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో దివ్యాంగులకు మంజూరైన నూతన త్రిచక్ర వాహనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం లక్షల రూపాయలు ఖర్చు చేసి అనేక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కరిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.శ్రీకృష్ణ, దివ్యాంగుల సంఘం చైర్మన్ ముంతాజ్ పఠాన్, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల సంఘ జిల్లా అధ్యక్షుడు దొంతిరెడ్డి గోపాల్‌రెడ్డి, రీజినల్ కోఆర్డినేటర్ మాలపోలు శ్యామ్, బత్తిన నరసింహారావు, పొదిలి, కొనకనమిట్ల దివ్యాంగుల సంఘ అధ్యక్షులు దేవళ్లపల్లి ఆంజనేయులు, నుసుం బాలచంద్రుడు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షురాలు ఎస్‌కే నూర్జహాన్‌బేగం, జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, పుల్లిగొర్ల శ్రీనివాసరావు, ముల్లా జాకీర్, ముల్లా షరీఫా, ముల్లా హసన్‌వలి పాల్గొన్నారు.



దివ్యాంగులకు త్రిచక్ర వాహనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

అంగన్‌వాడీల్లో ఆటపాటలతో విద్య



గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో సీడీపీఓ, సూపర్‌వైజర్లు

పొదిలి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య అందిస్తున్నట్లు సీడీపీఓ సుధామారుతి పేర్కొన్నారు. మంగళవారం కాటూరివారిపాలెంలో జనభాగీధార్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పిల్లల బంగారు భవిష్యత్ కోసం అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. కేంద్రాల్లో అందించే పోషకాహారం, ఇతర సేవల గురించి వివరించారు. ముందుగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సావిత్రి, సుభాషిణి, సుచరిత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీచింగ్ లెర్నింగ్ ఉపాధ్యాయురాలికి సన్మానం

యర్రగొండపాలెం: కోవిడ్ సమయంలో విద్యార్థులు బయటకు వెళ్లకుండా ఉండేలా ఆన్‌లైన్ పాఠాలు, వృథా పేపర్లతో బొమ్మలు వేయడం నేర్పించి సేవలు అందించిన ఉపాధ్యాయురాలు శాసనాల లలిత బదిలీపై వెళ్తున్న సందర్భంగా మంగళవారం ఎంఈవో పి.ఆంజనేయులు ఆమెను ఘనంగా సన్మానించారు. మండలంలోని బోయలపల్లిలో ఉపాధ్యాయురాలిగా చిన్నారులకు సేవలు అందించిన ఆమె గురిజేపల్లికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా లలిత విద్యార్థులకు పలకలు, పరీక్ష అట్టలు పంపిణీ చేశారు. ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులకు పాఠాలు చెప్పడమే కాకుండా టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ అలవాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. లెర్నింగ్ బై లలిత యుట్యూబ్ ఛానల్ ద్వారా ఆటలతో పాటు రోజుకో పదం విద్యార్థులకు నేర్పించడం, పప్పెట్ షోద్వారా పాఠాలు అర్థమయ్యే రీతిలో బోధించిన ఆమె తోటి ఉపాధ్యాయులకు స్ఫూర్తిదాయకమన్నారు. పాఠశాల చైర్మన్ హనుమంతరావు, ఉపాధ్యాయులు ఎంజే ప్రసాద్, సుకుమారి పాల్గొన్నారు.



లలితను సన్మానిస్తున్న ఎంఈవో ఆంజనేయులు

నేడు సచివాలయం ప్రారంభం

కంభం: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన కంభం–1 గ్రామ సచివాలయం భవనాన్ని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు బుధవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభించనున్నట్లు సర్పంచ్ పల్నాటి బోడయ్య, ఉప సర్పంచ్ సయ్యద్ ఖాసిం మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

తూనికలు..కొలతల శాఖ అధికారుల తనిఖీలు

- 11 షాపులపై కేసుల నమోదు

కురిచేడు: తూనికలు.. కొలతల శాఖ పొదిలి ఇన్‌స్పెక్టర్ షేక్ మోహిసిన్ తన సిబ్బందితో మంగళవారం పలు షాపులను తనిఖీ చేశారు. దొనకొండ, కురిచేడు మండలాల్లోని 11 షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. కాటాలకు ముద్రలు లేవని, సరుకుల ప్యాకెట్లపై డిక్లరేషన్ వివరాలు లేవని గుర్తించి సంబంధిత వ్యాపారులపై కేసులు నమోదు చేసి అపరాధ రుసుం విధించినట్లు ఆయన తెలిపారు. ఇకపై నెలకోసారి షాపులను తనిఖీ చేయనున్నట్లు చెప్పారు. షాపులు మూసి ఉంచడం సరైన పద్ధతి కాదని, కచ్చితంగా ప్రతిషాపు తనిఖీ చేయాల్సి ఉందన్నారు. ప్యాకెట్లు కొనేటప్పుడు డిక్లరేషన్ ఉండేలా వ్యాపారులు చూసుకోవాలని, కాటాలకు ఏటా ముద్రలు వేయించుకోవాలని సూచించారు. ఆయన వెంట సిబ్బంది భాస్కర్, రమేష్, నారాయణ పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ మోహిసిన్

రెండు వాహనాలు సీజ్

కొమరోలు: అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్న రెండు వాహనాలను ఇరిగేషన్ అధికారులు సీజ్ చేశారు. మండలంలోని అక్కపల్లె చెరువులో మంగళవారం జేసీబీ సాయంతో ట్రాక్టర్లకు అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టారు. సమాచారం అందుకున్న ఇరిగేషన్ ఏఈ జయరామయ్య.. పోలీసుల సహకారంతో అక్కపల్లె చెరువులో ఉన్న ట్రాక్టర్, జేసీబీని పోలీసుస్టేషన్‌కు తరలించి సీజ్ చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా చెరువులు, కుంటల్లో మట్టి తవ్వకాలు చేపడితే చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ ఏఈ జయరామయ్య హెచ్చరించారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మార్కాపురం: కుటుంబ సమస్యల నేపథ్యంలో పురుగుమందు తాగి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వేములకోట పంచాయతీ కోట్టాలపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై సుమన్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన జోన్నలగడ్డ వెంకటరమణయ్య కుటుంబ సమస్యల నేపథ్యంలో ఈ నెల 11న పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు గమనించి హుటాహుటిన వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ఒంగోలులో సోమవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు రూరల్ ఎస్సై సుమన్ మంగళవారం తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఇది రైతు ప్రభుత్వం

పొదర్తి (కొత్తపట్నం): రైతులకు అసైన్‌మెంట్ భూమి ఇవ్వాలన్నా, ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నా, చుక్కల భూమి పరిష్కారం చేయలన్నా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని పాదర్తి సర్పంచ్ కట్టా సౌంధర్య భర్త శేఖర్ అన్నారు. పాదర్తి గ్రామ సచివాలయంలో మంగళవారం చుక్కల భూముల హక్కు పత్రాలను పంపిణీ చేసిన సందర్భంగా మాట్లాడారు. 70 ఏళ్ల నుంచి ఎంతో మంది సీఎంలు, ప్రధాన మంత్రులు, ఎమ్మెల్యేలు మారినా.. ఒక్కరు కూడా చుక్కల భూముల గురించి పట్టించుకోలేదన్నారు. కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చుక్కల భూములను పరిష్కారం చేయటం ఎంతో అభినందనీయమన్నారు. పాదర్తి గ్రామంలో 402.21 ఎకరాలకు 362 మంది రైతులకు భూ హక్కు పత్రాలు శేఖర్, గుడి నాగిరెడ్డి, మూగ బాలాజీ చేతులతో పంపిణీ చేశారు. మూగా బాలాజీ, గ్రామస్తులు, వీఆర్వో బాబురావు పాల్గొన్నారు.